క్లుప్తంగా

సీఐ సైదిరెడ్డికి సన్మానం



సైదిరెడ్డిని సన్మానించిన కాంగ్రెస్‌ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐగా బాధ్యతలు తీసుకున్న సైదిరెడ్డితోపాటు ఎస్‌ఐ మారయ్యను మంగళవారం కాంగ్రెస్‌ నేతలు ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్‌ ఓబీసీ చైర్మన్‌ సుబ్బురి పాండు, ఏ–బ్లాక్‌ మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు మల్లిక, నియోజకవర్గ సేవాదళ్‌ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌, పార్టీ నాయకులు ఆనంద్‌ కిషోర్‌, రాజు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

కడ్తాల్‌: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయ భూముల పరిరక్షణ డిప్యూటీ కలెక్టర్‌ అనిత, తహసీల్దార్లు హరిత, విజయలక్ష్మీ.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ మోహన్‌ రావు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌ వేణుగోపాల్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌, నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్‌

తలకొండపల్లి: మండల పరిధిలోని బద్నాపూర్‌లో మంగళవారం సీసీ రోడ్డు పనులను డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్‌ ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరు చేసిన నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి కృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రమేష్‌, శ్రీను, సురేందర్‌, పురుషోత్తం, కృష్ణయ్య, రాజు, గణేష్‌, గణపతి, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

కడ్తాల్‌: మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఎంపీటీసీ రాములుగౌడ్‌ ప్రారంభించారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజానీకం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిచంద్ర, మహేశ్‌, రాజీవ్‌గౌడ్‌, యాదయ్య, లక్ష్మయ్య,నర్సింహ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి చక్కగా పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిగా వసంత్‌, జిల్లా ఉప విద్యాధికారిగా శశాంత్‌, ప్రధానోపాధ్యాయులుగా ప్రణీత, మరికొందరు ఉపాధ్యాయులుగా వ్యవరించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, శ్రీధర్‌, రాములయ్య, లక్ష్మణ్‌, శ్రీనివాస్‌, సునీత, వెంకటేశ్వరశర్మ, కృష్ణ, ప్రేమయ్య, అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతే లక్ష్యం

- 2023–24 ఏడాదికి గాను ఎస్‌ఎస్‌జీలకు రూ.40 కోట్ల రుణాలు
- ఆర్థిక పురోగతి సాధిస్తున్న మహిళలు
- ప్రతీనెల సమావేశాలతో చైతన్యం
- రుణపరిమితి పెంచుతామంటున్న అధికారులు



కుర్మిద్దలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన ఉద్యోగులు

యాచారం: మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పనిచేస్తోంది. బ్యాంకుల నుంచి విరివిగా రుణాలు అందజేయిస్తూ మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా బలోపేతం కావడానికి అధికారులు సంకల్పించారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల(ఎస్‌ఎస్‌జీ)కు 2023–24 ఏడాదికి బ్యాంకు లింకేజీ కింద రూ.42 కోట్ల రుణాలు ఇప్పించడానికి టార్గెట్‌ ఉంది. దీనికి సంబంధించి అర్హత కలిగిన 921 సంఘాలను అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 9వేలకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు.

రూ.40కోట్ల టార్గెట్‌ పూర్తి..

యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో అర్హత కలిగిన 921 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.42.32 కోట్ల రుణాలు ఇప్పించాలని అధికారులు టార్గెట్‌ పెట్టుకున్నారు. అందులో ఇప్పటివరకు 891 సంఘాలకు రుణాలు ఇప్పించారు. ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించారు.

యాచారం మండలంలోని స్వయం సహాయక సంఘాల వివరాలు	
గ్రామ సంఘాల సంఖ్య	: 43
స్వయం సహాయక సంఘాల సంఖ్య	: 1,224
సంఘాల్లో చేరిన మహిళల సంఖ్య	: 13,360
బ్యాంకు రుణాలు ఇప్పించడానికి గుర్తించిన సంఘాలు	: 921
2023-24 ఏడాదికి బ్యాంకు లింకేజీ టార్గెట్‌	: రూ.42.32 కోట్లు
ఇప్పటికే పూర్తిచేసింది	: రూ.40 కోట్లకు పైగానే
లబ్ధిపొందిన సంఘాల సంఖ్య	: 891

మండలంలోని మేజర్‌ గ్రామాలైన యాచారం, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, గునుగల్‌, నక్కర్తమేడిపల్లి, చింతపట్ల, మాల్‌ తదితర గ్రామాల్లోని మహిళా సంఘాలకు రూ.కోట్లాది రుణాలు ఇప్పించారు. కొన్ని చిన్న గ్రామాల్లో మహిళలు వాయిదా బకాయిలను సక్రమంగా చెల్లించడంతో ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించారు. మొండిగౌరెల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లోని మహిళా సంఘాలకు కూడా రూ.కోట్లాది రుణాలు ఇప్పించారు. ఫిబ్రవరి 18 వరకు రూ.40 కోట్లకు పైగా రుణాలు ఇప్పించడంతో పాటు మరో రూ.2కోట్లకు పైగా రుణాలు ఇప్పించేందుకు గాను అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

స్వయం కృషితో ఆర్థిక పురోగతి..

స్వయం సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు డబ్బులను వృథా చేసుకోలేదు. రుణాలు పొంది వ్యవసాయ పంటల్లో పెట్టుబడులు, చిరు వ్యాపారాలు, గొర్రెల, మేకల, పాడిగేదెల కొనుగోళ్లు, చేతి వృత్తులు తదితర వాటిలో పెట్టుబడులు పెట్టారు. వచ్చిన ఆదాయంతో ప్రతీనెల అప్పుతో కూడిన వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. మహిళల అప్పు వాయిదా చెల్లింపులను బట్టి ఆయా బ్యాంకుల మేనేజర్లు అడిగిందే తడువుగా రూ.లక్షలాది రుణాలు ఇచ్చేస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు కూడా ప్రతీనెల క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తుండటంతో మహిళలు కూడా చిరువ్యాపారాల ద్వారా పొందే ఆదాయంతో అప్పులు చెల్లించుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు.

జీవనోపాధి పొందుతున్నా



కుర్మిద్ద గ్రామంలో వినాయక పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. గతంలో రూ.లక్ష రుణం తీసుకుని చిరు వ్యాపారం చేస్తున్నాను. వ్యాపారంలో ఆర్థిక ప్రగతితో తాజాగా బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. తక్కువ వడ్డీతో అప్పు తీసుకున్నాను. ప్రతీనెల క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నాను. గ్రామంలో నాలాగే ఎంతోమంది మహిళలు అప్పులు పొంది వ్యవసాయంలో పెట్టుబడులు, గొర్రెలు, మేకలు, పాడిగేదెలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారు.

– స్వప్న, స్వయం సహాయక సభ్యురాలు, కుర్మిద్ద

రూ.5కోట్ల రుణాలు ఇప్పించా



తాడిపర్తి, నానక్‌నగర్‌, కుర్మిద్ద గ్రామాల్లో 142 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. 2023–24 ఏడాదికి గాను ఇప్పటివరకు రూ.5కోట్ల 32 లక్షల రుణాలు ఇప్పించాను. నక్కర్తమేడిపల్లి ఇండియన్‌ బ్యాంకు, మీరాఖాన్‌పేటలోని ఎస్‌బీఐలో మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించాను. ప్రతీనెల సమావేశాలు నిర్వహించి అప్పు వాయిదాలు సక్రమంగా చెల్లించేలా కృషి చేస్తున్నాం.

– గణేష్‌, సీసీ

రుణపరిమితి పెంచుతాం



2024–25 ఏడాదికి గాను యాచారం మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తాం. ఈ ఏడాది రూ.42 కోట్ల టార్గెట్‌ పూర్తిచేశాం. వచ్చే ఏడాది రూ.60 కోట్లకు పైగా టార్గెట్‌ పెట్టుకుంటాం. రుణాలు ఇప్పించడంతో పాటు వసూల్‌ అయ్యేలా, ప్రతి నెల బ్యాంకుల్లో చెల్లించేలా మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నాం. మహిళలు తీసుకున్న రుణాలను క్రమంగా చెల్లిస్తే వారి రుణపరిమితిని పెంచుతాం.

– సుదర్శన్‌రెడ్డి, ఏపీఎం, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్‌ కమిషనర్‌కు విద్యానగర్‌ కాలనీవాసుల వినతి



మున్సిపల్‌ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఆమనగల్లు మున్సిపల్‌ కార్యాలయంలో మంగళవారం నూతన కమిషనర్‌ వసంతను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్‌, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే నూతన కమిషనర్‌ వసంతను మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌, నాయకులు.. రవి, మహేశ్‌యాదవ్‌, గోపి, నర్సింహ, రాములు, శ్రీను, ప్రశాంత్‌, సురేశ్‌, భారతమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన బూరమోని బాలమణి (54) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌ అదేరోజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో దర్శన్‌, రాములు, శ్రీకాంత్‌, జగన్‌, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: శ్రీవాణి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఉప్పల చారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కి చెందిన నీరడి శ్రీవాణి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మంగళవారం సింగిల్‌ విండో వైస్‌ చైర్మన్‌ రవితో కలిసి ఉప్పల వెంకటేష్‌ ఆస్పత్రికి వెళ్లి శ్రీవాణిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు.. మల్లేష్‌, మాజీ సర్పంచ్‌ లలితాజ్యోతయ్య, మాజీ ఉప సర్పంచ్‌ అజీజ్‌ తదితరులు పాల్గొన్నారు.

23న కాంగ్రెస్‌ సమావేశం

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఈనెల 23న కల్వకుర్తి పట్టణంలోని కేసీఆర్‌ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావ్‌, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. భక్తుల సందడితో, భజనపరుల సంకీర్తనల మధ్య బ్రహ్మోత్సవాలు అత్యంత రమణీయంగా జరిగాయి. ఆలయంలో ఆరురోజులుగా నిత్యనిధి, చక్రస్నానం, అఖండదీపారాధన, అభిషేకం, పూర్ణాహుతి, మహదాశీర్వాదం, సత్యనారాయణస్వామి వ్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు వెంకటేశ్వరశర్మ, క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ కిష్టమ్మ, మాజీ ఉప సర్పంచ్‌ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో వెలిసిన శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5న ప్రారంభమై 7న ముగుస్తాయి. ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డిని తదితరులను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు అంబాజీ, శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్‌ అజీజ్‌, నాయకులు.. అశోక్‌, బాబు, చర్ల వెంకట్‌రెడ్డి, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌ క్లబ్‌ జిల్లా మాజీ గవర్నర్‌ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో గంగాపురం వెంకటరాజిరెడ్డి స్మారక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. దాదాపు 400 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు కందుకూరు లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ డాక్టర్‌ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, రీజియన్‌ చైర్మన్‌ సాధు ప్రభాకర్‌ రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి రామన్‌బాబు, మాజీ అధ్యక్షుడు అంజయ్య, బీఆర్‌ రాంరెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, పున్న భిక్షపతి, సురేందర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్‌, గోపాల్‌ రెడ్డి, తిరుమలరెడ్డి, ఎస్‌.సుధాకర్‌రెడ్డి, లచ్చయ్య, వెంకటేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాదయ్యకు నేతల నివాళి



తుర్కయంజాల్‌: యాదయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

తుర్కయంజాల్‌: తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని తుర్కయంజాల్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగమ్మ, సునీల్‌, నాయకులు అశోక్‌గౌడ్‌, బల్‌దేవ్‌రెడ్డి, జంగయ్యగౌడ్‌, శ్యామ ల, విష్ణువర్ధన్‌ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతిని మంగళవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇబ్రహీంపట్నం చెరువుకట్టపై ఉన్న అమరవీరుల స్థూపం వద్ద యాదయ్య చిత్రపటాన్ని పెట్టి బీఆర్‌ఎస్‌ నేతలు నివాళులు అర్పించారు. తెలంగాణ సాధనలో ఆయన సేవలను కొనియాడారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు అరవింద్‌, సాప్పరి కరుణాకర్‌, మహేశ్‌, జగన్‌, వెంకటేశ్‌, సంజయ్‌, మల్లేష్‌, కైలాస్‌, శ్రీకాంత్‌, ప్రదీప్‌, చందులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాడ్గుల: మాడ్గుల మండలం ఇర్విన్‌ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఎల్బీనగర్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఫిజికల్‌ సైన్స్‌ ఫోరం మరియు బయో సైన్స్‌ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్‌ టాలెంట్‌ టెస్టులో మొదటి, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. సూదిని నచ్చికేత్‌ రెడ్డి మొదటి బహుమతి, ఆకుతోట స్నోహిత మూడవ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ఫిజికల్‌ సైన్స్‌ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌ సింగ్‌, జిల్లా బాధ్యులు మహిపాల్‌, జెస్సీ కుమార్‌, అపర్ణ, జంగారెడ్డి, శ్రీలక్ష్మి బహుమతులు అందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

దళితవాడలకు నిధులివ్వండి

తలకొండపల్లి: మండలంలోని దళితవాడలను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ మండల చైర్మన్‌ చెన్నకేశవులు మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డిని కోరారు. చీపునుంతల–సాలార్‌పూర్‌ మట్టి రోడ్డు మార్గంలో బీటీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే ఈ మార్గం మధ్యలో అవసరమైన చోట కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. చీపునుంతలకు సీసీ రోడ్డు మంజూర్‌ చేసినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

తహసీల్దార్‌కు ఏబీవీపీ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: పెండింగ్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌ సునీతకు ఏబీవీపీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా కన్వీనర్‌ సాయిచరణ్‌ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యావ్యవస్థపై సమీక్ష నిర్వహించలేదన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి విద్యనభ్యసిస్తుంటారన్నారు. అయితే ప్రభుత్వం పెండింగ్‌ నిధులను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్‌, నగర కార్యదర్శి మహేందర్‌, ఎస్‌ఎఫ్‌ఎస్‌ విభాగ్‌ కన్వీనర్‌ సాయికిరణ్‌, పవన్‌, ఆదర్శ్‌, శివ, దీపక్‌ పాల్గొన్నారు.

సేవాలాల్‌ సేవలు చిరస్మరణీయం

ఎంపీపీ నర్మద



సేవాలాల్‌ జయంతిలో గిరిజనులు

మంచాల: మంచాల మండల పరిధిలోని లోయపల్లిలో జెండా దేవుని గుడి దగ్గర సద్గురు శ్రీ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. సేవాలాల్‌ మహారాజ్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గిరిజన సాంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన జాతి కోసం సేవాలాల్‌ చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, తహసీల్దార్‌ వెంకట ప్రసాద్‌, ఎంపీడీఓ బాల శంకర్‌, ఎంపీఓ తేజ్‌ సింగ్‌, సేవాలాల్‌ సంఘం నాయకులు శ్రీనివాస్‌నాయక్‌, బాలునాయక్‌, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు , గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌

కడ్తాల్‌: కడ్తాల్‌ మండలంలో రెవెన్యూ సమస్యలతో పాటు, విద్యా, వైద్యరంగ సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌ మంగళవారం జరిగిన జిల్లా పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో కోరారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో అనేకమంది రైతుల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని ఆ భూములను నిషేధిత జాబితానుంచి తొలగించి రైతులకు పట్టాలు అందించాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కడ్తాల్‌ మండల కేంద్రంలో పీహెచ్‌సీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వం మంజూరు చేసిన 30 పడకల ఆస్పత్రికి త్వరితగతిన స్థల సేకరణ చేపట్టి, ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని సభ దృష్టికి తెచ్చినట్లు జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌ తెలిపారు. మిగితా సభ్యులు కూడా స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.